నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, ఆదివారం 4 మే 2025 | KHAMMAM



ఊరూరా.. నీటి గోస

ఇల్లెందు మండలంలో తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు(ఫైల్)

"ఇల్లెందు మండలం వడ్డుగూడెం గ్రామ పంచాయతీ నెహ్రూనగర్ గ్రామంలో 46 కుటుంబాలు ఉంటున్నాయి. తాగడానికి నీరు లేక గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నోసార్లు అధికారుల్ని కలిసి తమ సమస్యను విన్నవించుకున్నా చూస్తాం.. చేస్తాం అంటున్నారే కానీ తాగునీరు అందించిన పాపానపోలేదు. ఉన్న భగీరథ పైప్‌లైన్‌ను అధికారులు తీసేశారని గ్రామస్తులు చెబుతున్నారు. చేతిపంపుల్లో సైతం నీరు రాకపోవడంతో గ్రామస్తులు చాలాసార్లు రోడ్డెక్కి నిరసన తెలిపారు."

దుమ్ముగూడెం మండలం కొత్త జిన్నెలగూడెంలో తాగునీటి బోరు చెడిపోవడంతో గ్రామస్తుల నిరసన (ఫైల్)


కాలిపోయిన మోటర్ బాక్సు

"దుమ్ముగూడెం మండలం కొత్త జిన్నెలగూడెం గ్రామంలో 60 కుటుంబాలు ఉన్నాయి. మిషన్ భగీరథ ట్యాంకు ఉన్నప్పటికీ ఇంటింటికీ కుళాయి ద్వారా నీరు రావడం లేదు. పంచాయతీ మోటర్ ద్వారా అయినా నీరు తెచ్చుకుందామంటే అదీ రిపేర్‌లో ఉంది. సమస్య చెప్పకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్తులకు చేతిపంపులే దిక్కు అయ్యాయి. వాటిలో కాస్తా అంతంత మాత్రమే నీరు వస్తుండడంతో తాగునీటికి తంటాలు పడుతున్నారు."

- అడుగంటుతున్న జలాలు.. ఇబ్బంది పడుతున్న ప్రజలు
- మిషన్ భగీరథ ఉన్నా.. నిర్వహణా లోపం
- చేతిపంపుల్లో చుక్కనీరు రావడం లేదు..
- ఏజెన్సీ ప్రజల కష్టాలు వర్ణనాతీతం
- భద్రాద్రి జిల్లాలో ప్రత్యామ్నాయం చూపని అధికారులు
- మే నెలలో తీవ్రతరంకానున్న తాగునీటి సమస్య

భద్రాద్రి కొత్తగూడెం, మే 3 (నమస్తే తెలంగాణ) : వేసవికాలం వచ్చిందంటే చాలు భద్రాద్రి కొత్తగూడెం ప్రజలకు శాపంగా మారుతున్నది. ప్రభుత్వ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రతియేటా తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మంచినీళ్లు మహాప్రభో అంటూ రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురిస్తున్నది. ఒకచోట కాదు.. రెండుచోట్ల కాదు జిల్లాఅంతటా చాలా గ్రామాల్లో తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. ఒకవైపు గోదావరిలో కూడా నీరు అడుగంటడంతో మిషన్ భగీరథ మోటర్లకు సైతం నీరు అందడం లేదు. దీంతో మే నెలలో జిల్లాలో తాగునీటి సమస్య మరింత జఠిలమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఏనాడూ బిందెలతో రోడ్డెక్కిన సందర్భాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ప్రజలను కష్టాలు పాలుచేస్తున్నదని, మళ్లీ పాతరోజులు వచ్చాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనిష్ఠస్థాయికి గోదావరి

భద్రాచలం, మే 3 : భద్రాచలం వద్ద గోదావరి నీటి నిల్వ కనిష్ఠస్థాయికి పడిపోయింది. 2019 తరువాత ఇలాంటి పరిస్థితి ఏర్పడటం ఇదే తొలిసారి. భద్రాచలం పట్టణానికి ప్రతిరోజు 6.5 ఎంఎల్‌డీల నీటిని తాగునీటి నల్లాలకు సరఫరా చేస్తారు. కానీ ప్రస్తుతం ఇన్‌టెక్ వెల్‌లో సిల్టు 15 అడుగుల మేర పేరుకుపోవడంతో తాగునీటి సరఫరాకు గడ్డు పరిస్థితి ఏర్పడుతోంది. సాధారణంగా వేసవి సమీపించే సమయంలోనే సిల్టు తొలగించే పనులు పూర్తి చేయాలి. కానీ అధికారులు దృష్టిసారించకపోవడంతో ప్రస్తుతం నీటి నిల్వ రెండు అడుగుల స్థాయికి పడిపోయింది. దీంతో పంపింగ్ సక్రమంగా జరగడం లేదు. గత మూడ్రోజులుగా అధికారులు సిల్టు తొలగించే పనులు చేస్తున్నా అవి ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితి. భద్రాచలం పట్టణంలో ప్రస్తుతం రోజూ గంట, రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో తెల్లవారుజాము నుంచే ప్రజలు నల్లాల వద్ద కాపలాకాయాల్సి వస్తోంది.

భద్రాచలం వద్ద అడుగంటిన గోదావరి నీరు

తాగేందుకు గుక్కెడు నీళ్లు లేవాయె..

నీటి సరఫరా లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా లేకపాయె. తాగునీటి కోసం ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. తాగునీటి విషయంలో ప్రజాప్రతినిధులు స్పందించాలి. నీటి సరఫరా చేయని పక్షంలో ధర్నాలు, రాస్తాకోలు చేస్తాం.

–జాటోత్ చంద్రమ్మ, నెహ్రూనగర్, ఇల్లెందు మండలం

వేసవిలో ఇబ్బంది లేకుండా చూడాలి..

వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి. ఈ విషయం గురించి అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశాం. పంచాయతీ కార్యదర్శికి తాగునీటి విషయంలో పడే ఇబ్బంది గురించి వివరించాం. కనీసం వాటర్ ట్యాంకు ద్వారా నీరు అందించాలని కోరాం. అయినా మమ్మల్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

–నూనావత్ భద్రమ్మ, నెహ్రూనగర్, ఇల్లెందు మండలం

తోగు నీరే తాగునీరు

- వెంకటచెర్వులో మొండికేస్తున్న బోర్లు
- ఆదివాసీలకు తప్పని నీటి తిప్పలు
- భగీరథను పట్టించుకోని అధికారులు

నీరురాని చేతి పంపు

చర్ల మండలంలో తోగుల్లో నీటిని తోడుతున్న ఆదివాసీలు

చర్ల, మే 3: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని వెంకటచెర్వులో నివసిస్తున్న ఆదివాసీలకు వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదు. గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని అడవిలో తోగుల వద్ద నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. నీరు కలుషితం కాకుండా ఉండేందుకు తూరలు వేసి బావిలాగా చేసుకున్నారు. అందులో ఊరిన నీటిని రోజూ తోడుకుని తెచ్చుకొని తాగుతున్నారు. గత మూడునెలల నుంచి తోగు నీటినే తాగునీటి కోసం వాడుకుంటున్నారు.

సుమారు 50 కుటుంబాలున్న వెంకటచెర్వు గ్రామంలో 200 వందలకు పైగానే ఓటుహక్కు కలిగిన వారున్నారు. 50 ఏళ్లకు పూర్వం ఛత్తీస్‌గఢ్ నుంచి వివిధ కారణాల వల్ల ఈ ప్రాంతానికి వలసొచ్చి చర్లకు 5 కిలోమీటర్ల దూరంలోని అడవిలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ వెంకటచెర్వు గ్రామంలో తాగునీటి కోసం గత పాలకులు మొత్తం నాలుగు బోర్లు వేయించారు. గ్రామంలో ఉన్న బోర్లన్నింటిలో బకెట్ నీళ్లు వస్తే తర్వాత గాలి వస్తున్నదని గ్రామస్తులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ గ్రామానికి భగీరథ నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్లు వేయించింది. గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో భగీరథ నీరు ఎటువంటి ఆటంకం లేకుండా సరఫరా జరిగింది.. కానీ.. ప్రస్తుతం గడిచిన 5 నెలల నుంచి భగీరథ పైపుల నుంచి నీరు రావడంలేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా మిషన్ భగీరథ గురించి పట్టించుకోలేదని తమ బాధను వెల్లడిస్తున్నారు.

అడవిలో నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న మహిళలు

నీటి కోసం అడవిలో నడిచిపోతున్నం..

ప్రతి సంవత్సరం ఎండాకాలం నీటికి ఇబ్బంది పడుతున్నం. ఈ యేడాది తాగునీరు కూడా దొరకడం లేదు. తోగుల వద్దకు పోయి ఊట నీటిని తోడుకుని తెచ్చుకుని తాగుతున్నం. తోగు నీటిని తెచ్చుకునేందుకు అడవిలో నడిచిపోతున్నం. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. ఆడోళ్లందరం కలిసి అడవికి పోయి తాగునీరు తెచ్చుకుంటున్నం.

– కురసం సమ్మక్క, వెంకటచెర్వు, చర్ల మండలం

బకెట్ నీళ్లొస్తే.. తర్వాత గాలొస్తున్నది..

ప్రభుత్వం వేసిన బోర్లు ఎండాకాలం పనిచేస్తలేవు. బకెట్ నీళ్లొస్తే తరువాత చుక్కనీరు కూడా రావడం లేదు గాలొస్తున్నది. అధికారులకు చెప్పినం ఏదో చేసినట్టు చేస్తరు మళ్లీ మామూలే. మా ఊర్ల ఉన్న బోర్లన్నీ ఇట్లనే ఉన్నయ్. అడవిలో తోగు దగ్గరికి పోయి నీళ్లు తెచ్చుకొని తాగుతున్నం. వాటికే అలవాటుపడ్డం. ఎండాకాలం అంతా ఇంతే మా బతుకు. ప్రతి ఏడాది నీటికి ఇబ్బంది పడుతూనే ఉన్నాం.

– కోరం సంతోష్, వెంకటచెర్వు, చర్ల మండలం

చివరి గ్రామాలకు సమస్య ఉంది..

మండలాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేదు. చివరి గ్రామాలకు మాత్రం ట్యాంకులు ఎత్తున ఉండటంతో నీరు చేరడం లేదు. రిపేర్లు ఉన్న పైప్‌లైన్లన్నీ మరమ్మతులు చేశాం. ఇల్లెందు మండలం నెహ్రూనగర్‌లో కొత్త పైప్ లైన్ వేయాల్సి ఉంది. కలెక్టర్ సారు రూ.20 లక్షలు మంజూరు చేశారు. నెలరోజుల్లో అక్కడ పనులు పూర్తిచేస్తాం. చేతిపంపులన్నీ వర్కింగ్‌లోనే ఉన్నాయి.

– ఈఈ తిరుమలేష్, ఈఈ, మిషన్ భగీరథ, భద్రాద్రి కొత్తగూడెం

ప్రజలంటే ప్రభుత్వానికి లెక్కలేదా..

మా కాలనీలో సుమారు 45 కుటుంబాలకు నీటి సరఫరా కావడం లేదు. తాగునీరు రావడం లేదనే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రతిరోజూ తాగునీటి కోసం యుద్ధం చేయాల్సి వస్తోంది. ఈ ప్రభుత్వానికి ప్రజలంటే లెక్కలేదా. ఇప్పుడే ఇలా ఉంటే ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కావడం లేదు.

–వల్లాల సరోజ, నెహ్రూనగర్, ఇల్లెందు మండలం

చేతిపంపు నీరే మాకు గతి..

భగీరథ ట్యాంకుకు నీరు ఎక్కడం లేదు. ఊర్లో ఉన్న మోటర్ కాలిపోయింది. రిపేరు చేయించమంటే ఎవరూ చేయించడం లేదు. డబ్బులు వేసుకుని మీరే చేయించుకోమంటున్నారు అధికారులు. చేతిపంపుల దగ్గరకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాము. ఎండలు పెరిగితే చేతిపంపుల్లో కూడా నీరు ఉండదు. ఏటా మాకు నీటి కష్టాలు తప్పడం లేదు.

– తుర్రం రాము, కొత్త జిన్నెలగూడెం, దుమ్ముగూడెం మండలం

నిత్యం తాగునీటి ఇబ్బందులు

భద్రాచలం పట్టణంలో తాగునీటికి ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతుల పేరుతో ఉదయం, సాయంత్రం తక్కువ సమయం తాగునీటి సరఫరా ఇవ్వడంతో నల్లాల్లో వచ్చిన నీరు సరిపోవడంలేదని మహిళలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు సిల్టు తొలగింపు పనులు త్వరితగతిన చేపట్టి సకాలంలో మంచినీటి సరఫరా జరిగేలా చూడాలి.

– ఆకోజు సునీల్‌కుమార్, స్థానికుడు, భద్రాచలం

ఇండ్ల కోసం ట్యాంకు ఎక్కి నిరసన

అనర్హులకు కేటాయించిన వాటిని రద్దు చేయాలని గిరిజనుల డిమాండ్

వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

జూలూరుపాడు, మే 3 : ఇందిరమ్మ ఇండ్ల జాబితా నుంచి అనర్హుల పేర్లు తొలగించి.. అర్హులకే ఇండ్లు కేటాయించాలని కోరుతూ జూలూరుపాడు మండలం బేతాళపాడు పంచాయతీ పరిధిలోని రేగళ్లతండాకు చెందిన గిరిజనులు శనివారం వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అయితే పేదలకు ఇండ్లు కేటాయించకుండా ఆస్తులు ఉన్న వారికి కేటాయించడం ఏమిటని వారు ప్రశ్నించారు. అనర్హులకు కేటాయించిన ఇండ్లను రద్దు చేసే వరకు కిందికి దిగేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పినప్పటికీ తమకు న్యాయం జరిగే వరకు దిగమంటూ తేల్చిచెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగి నిరసన విరమించారు. అయితే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడిన చౌడం వెంకటేశ్వర్లు, బానోతు కళ్యాణ్, బానోతు కవిత, ధారావత్ నాగమణి, బానోతు బిందు, బానోతు సునీత, ధారావత్ బాబులపై పంచాయతీ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జూలూరుపాడు ఎస్ఐ రవి తెలిపారు.

డబ్బులు ఇస్తేనే ఇండ్లా?

తడికలపూడి, తావుర్యాతండా గ్రామస్తుల ఆవేదన

అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

టేకులపల్లి, మే 3 : నిరుపేదలను వదిలి.. డబ్బులు ఇచ్చిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని తడికలపూడి, తావుర్యాతండా ప్రజలు ఆరోపించారు. ఆయా గ్రామాలకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే కోసం అధికారులు శనివారం వెళ్లడంతో పలువురు గ్రామస్తులు వారిని ప్రశ్నించారు. అర్హులైన నిరుపేదల ఇందిరమ్మ లబ్ధిదారులుగా ఎంపిక చేయాల్సి ఉండగా.. డబ్బులు తీసుకొని జాబితాలో పేర్లు చేర్చడం ఏమిటని మండిపడ్డారు. అలాంటప్పుడు గ్రామాల్లో తిరుగుతూ సర్వేలు ఎందుకు చేయాలని, డబ్బులు ఇచ్చిన వారి పేర్లే రాసుకోండి.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడే 'నీట్'

- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష
- జిల్లాలో హాజరుకానున్న 2,739 మంది విద్యార్థులు

ఖమ్మం, మే 3 : వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్ష కోసం అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. జిల్లాలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 2,739 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1:30 నిమిషాలకు ఆయా కేంద్రాల గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులందరూ మధ్యాహ్నం 1:30లోపే తమ తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు https://neet.nta.nic.in పోర్టల్ నుంచి ప్రవేశ పరీక్ష అడ్మిట్ కార్డులను డౌన్ లోడ్ చేసుకోవాలి. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పోస్ట్‌కార్డు సైజు ఫొటో, ఫొటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు(ఆధార్, పాన్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు) తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఎలాంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులను తీసుకెళ్లడానికి అనుమతి లేదు.

పరీక్షా కేంద్రాలు ఇవే..

ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, శాంతినగర్ ప్రభుత్వ హైస్కూల్, ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్, రూరల్ మండలం కరుణగిరి సమీపంలోని కేంద్రీయ విద్యాలయం.

తరుగు తీయొద్దు.. ఆలస్యం చేయొద్దు..!

- ధాన్యం కొనుగోళ్లు వేయవంతం చేయాలని రైతుల డిమాండ్

తరుగు, కొర్రీలు లేకుండా ధాన్యం తీసుకోవాలని, కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం నాయకులు, రైతులు ఉమ్మడి ఖమ్మ జిల్లా మధిర, తిరుమలాయపాలెం, చంద్రుగొండ మండలాల్లో శనివారం ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన శ్రమ అంతా వృథా అవుతుందని, ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

మధిరలో ధర్నా

మధిర, మే 3 : విక్రయానికి తరలించిన ధాన్యాన్ని వెనువెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో మధిర–విజయవాడ ప్రధాన రహదారిపై శనివారం ధర్నా నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, రైతు సంఘం నాయకులు పాపినేని రామనర్సయ్య, శీలం నరసింహారావు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి 15 రోజులు అవుతున్నా ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. వర్షం ఎప్పుడు వస్తుందో తెలియకపోవడంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోతున్నదని, దీనికి ఎవరు బాధ్యత వహించాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని రైతులు, సీపీఎం నాయకులతో మాట్లాడారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మందా సైదులు, పడకంటి మురళి, తేలప్రోలు రాధాకృష్ణ, ఊట్ల శంకర్‌రావు, పుచ్చకాయల కిశోర్, రైతులు పాల్గొన్నారు.

చంద్రుగొండలో ఆందోళన

చంద్రుగొండ, మే 3 : కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్ల తరుగు దోపిడీని నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మార్కెట్ గోదాముల సముదాయంలోని కొనుగోలు కేంద్రంలో రైతులు శనివారం ఆందోళనకు దిగారు. కాంటా వేసిన ధాన్యం బస్తాలను మిల్లులో దించడానికి క్వింటాకు 5 నుంచి 7 కేజీల వరకు తరుగు ఇవ్వాలని మిల్లర్లు డిమాండ్ చేయడంతో ససేమిరా అన్న రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే.. తరుగు పేరుతో మిల్లర్లు దోపిడీ చేయడం సరికాదన్నారు. క్వింటాకు 2.100 గ్రాముల వరకు అదనంగా కాంటా వేయడంతోపాటు అదనంగా మరో 5 నుంచి 7 కేజీలు తరుగు పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో పట్టపగలే ఇంత దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. మిల్లర్ల అవినీతిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మధిర–విజయవాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

బందంపల్లిలో రాస్తాకోరో

తిరుమలాయపాలెం, మే 3 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బందంపల్లి గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి రోజులతరబడి పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. కేంద్రాల్లో రైతులను నిర్వాహకులు, మిల్లర్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బింగి రమేశ్, తుళ్లూరి నాగేశ్వరావు, కోడి లింగయ్య, వీరేష్, చాగంటి వీరస్వామి, దుబాకుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.